# ప్రజాశక్తి

ప్రతిఅక్షరంప్రజలపక్షం

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Khammam, Kurnool, Tirupathi, Karimnagar, Rajamahendravaram, Srikakulam and ongole

సంపుటి : 36 సంచిక : 79
12 + స్నేహ + 8 పేజీలు వెల : 5.00

విజయవాడ, ఆదివారం 20-3-2016

facebook/prajasakti, twitter/prajasakti





యేటి ప్రయాణం, సంస్కృతి సమూహంలో పరిణామం జరిగినా మహానాయకుల రాక జరిగినా, అంతే అంతే వివరం అద్దంలో చక్కటి కవిత్వాన్ని ఆవిష్కరించే కవీశయుగపు భావుకుడైనా, కాన్వాస్‌పై నిండుగా రంగులు పులుముతూ అర్థవంతమైన బొమ్మలుగీసే చిత్రకారుడైనా.. తనలో ఓ స్వప్నికుడు దాగుంటాడు. కనిపించని ప్రపంచాన్ని చూడటానికి తనలో ఓ అంతర్లీన స్వప్న కావాలి. అంతరంగంలోని తన అనుభవాలను బయట పెట్టడానికి నిరంతరం స్వప్నిస్తూనే ఉండ గలగాలి.



# అదే సీన్

- రెండో రోజూ రోజాను అడ్డుకున్న మార్షల్స్
- గాంధీ విగ్రహం ముందు నిరసన
- లిఖిత పూర్వక జవాబివ్వాలని డిమాండ్
- సొమ్మసిల్లి పడిపోయిన రోజా - నిమ్స్‌కు తరలింపు

2





## నల్లదుస్తులతో వైసిపి సభ్యులు సభకు హాజరు

- స్పీకర్ పోడియం చుట్టూ చేరి నిరసన
- సభ రెండు సార్లు వాయిదా
- గందరగోళం మధ్యనే ప్రశ్నోత్తరాలు, మూడు బిల్లులు



## కొడాలి నానిపై వేటు?

- సిఎం కుటుంబంపై వ్యాఖ్యలే కారణం
- రోజా క్షమాపణ చెప్పాల్సిందే
- రేపు కమిటీ నివేదిక

# రష్యాలో ఘోర విమాన ప్రమాదం

- 62మంది దుర్మరణం
- అననుకూల పరిస్థితుల్లో ల్యాండింగ్‌కు ప్రయత్నం
- దుర్ఘటనపై దర్యాప్తు ప్రారంభం

10

# ఉత్తరాఖండ్ సంక్షోభం

- అరుణాచల్ మాదిరే ఇక్కడా..!
- ప్రభుత్వాన్ని పడగొడుతున్న బిజెపి
- ఫిరాయింపులకు ప్రోత్సాహం
- రావత్‌పై తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు
- 28వరకు బలాన్ని నిరూపించుకోండి
- సిఎం రావత్‌కు గవర్నరు ఆదేశం

9

# సత్వర న్యాయమే లక్ష్యం

- న్యాయాధికారుల సదస్సులో జస్టిస్ దవే
- కోర్టులే న్యాయాలయాలు :కెసిఆర్
- అమరావతిలో ప్రపంచ స్థాయి హైకోర్టు : చంద్రబాబు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమయం చేసిన ప్రతిదినం... ఆయన నేడిట సాయం చేయలేదు. కాబట్టి ఆయన తరపున కక్షిదారులకు న్యాయం అందించేందుకు కృషి చేయాలి.. అని న్యాయాధికారులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్ దవే సూచించారు. వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉంటే అవి వర్షంలా ఇబ్బంది పడతాయని, సత్వర న్యాయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఎవరికి వారు తమ అంతరాత్మకు జవాబుదారీ కావాలన్నారు. జ్యుడీషియల్ ఆఫీసర్స్ ఉమ్మడి రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్సు శనివారం ఇక్కడ ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ దవే మాట్లాడుతూ, న్యాయాధికారులు నీతి, నిజాయితీలే లక్ష్యంగా పని చేయాలని పిలుపుని చ్చారు. ఇది ఉద్యోగం అనుకోవడం కంటే, సమాజ సేవగా భావిస్తే సంతృప్తి లభిస్తుందన్నారు. పెండింగ్ కేసుల పరిష్కార దిశగా రాష్ట్ర స్థాయి సదస్సు సంతోషకరమన్నారు. వ్యవస్థల అభివృద్ధి పరుగుపెంపుదల వల్ల మంచి ఫలితాలు సాధిం చవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వ (మిగతా...10)

ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై 22న విజయవాడలో ప్రదర్శన, బహిరంగసభ : వామపక్షాలు

10

ప్రజాశక్తి మొబైల్ యాప్ ప్రారంభం

మార్పులకు అనుగుణంగా ముందడుగు యాప్‌తో పాఠకులకు మరింత చేరువ

12

7వ పేజీలో
వైట్ హౌస్‌కు
ఆ పేరు ఏలా వచ్చింది?



యతి ప్రాసలు, సంస్కృత సమాసాలతో పదబంధం బిగిస్తూ మహాకావ్యాలు రాసే ఉద్ధండ కవైనా, అలతి అలతి పదాల అల్లికతో చక్కటి కవిత్వాన్ని అక్షరీకరించే నవీనయుగపు భావుకుడైనా, కాన్వాస్‌పై నిండుగా రంగులు పులుముతూ అర్థవంతమైన బొమ్మలుగీసే చిత్రకారుడైనా.. తనలో ఓ స్వప్నవీచిక దాగుండాలి. కనిపించని ప్రపంచాన్ని చూడ్డానికి తనలో ఓ అంతర్లీన స్పర్శ కావాలి. అంతకుమించి తన ఆవిష్కరణను బయటపెట్టడానికి నిరంతరం స్వప్నిస్తూనే ఉండగలగాలి. ఛాయాచిత్రకారుడు కూడా దీనికి అతీతంకాదు. ప్రపంచాన్ని వెయ్యికళ్ళతో స్వప్నిస్తేగానీ.. తాను కల(ళ)లుగన్న స్వప్నరూపాన్ని ఆవిష్కరించడం కష్టం. చేసే వృత్తి, అభిరుచిలో అలాంటి కల(ళ)బోత తోడైతే అన్నీ అద్భుతచిత్రాలే అవుతాయి. అలాంటి అరుదైన ప్రకృతి ప్రేమిక ఫొటోగ్రాఫరే శ్రీనివాస్‌రెడ్డి.

# వెయ్యి కళ్ల స్వాప్నికుడు













సాధారణంగా మనం ఇంగ్లీష్‌లో ఫొటోగ్రాఫర్ అని పిలుచుకునే ఛాయాచిత్రకారుల్ని చమత్కారంగా ఒంటికన్ను రాక్షసులంటాం. కానీ ఇప్పుడు మనకు పరిచయం కాబోతున్న దృశ్యమాంత్రికుడ్ని అలా అనే సాహసం చేయలేం. ఎందుకంటే ఉన్న రెండుకళ్ళను పదింతలు చేసుకుంటేగానీ అలాంటి అద్భుతమైన చిత్రాల్ని చూడలేం. అందుకే తాజాగా ఆ కెమెరా కంటికి మరోప్రతిభా పురస్కారం తోడైంది. అంతర్జాతీయ స్థాయిలో 'వైల్డ్‌లైఫ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ఏటా అందజేసే 'సలీం అలీ మెమోరియల్' పురస్కారం ఈ ఏడాది విజయవాడకు చెందిన తమ్మా శ్రీనివాసరెడ్డిని వరించింది. గత పదిహేనేళ్ళలో ఈ అవార్డు అందుకున్నవారిలో ఈయన మూడో భారతీయ ఫొటోగ్రాఫర్.

**వలస పక్షులే**

దేశంలోని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు ఎంతో గౌరవంగా భావించే ప్రకృతి ప్రేమికుడు పద్మభూషణ్ 'సలీం అలీ మెమోరియల్' పురస్కారం శ్రీనివాసరెడ్డిని వరించేలా చేసింది ఏటా మన దేశానికొచ్చే వలసపక్షులే. అదీ.. మన రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పక్షుల విహారకేంద్రాలైన పశ్చిమగోదావరి జిల్లాలోని కొల్లేరు, గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు, నెల్లూరు జిల్లాలోని నేలపట్టు ప్రాంతాలకు వస్తూ ఉండే వలసపక్షులపై చేసిన ఛాయాచిత్రపు పరిశీలనే శ్రీనివాస్‌రెడ్డికి అవార్డు వరించేలా చేశాయి.

దాదాపు ఆరేడేళ్ళుగా వలసపక్షుల్ని అనుసరిస్తూ, అనుకరిస్తూ, కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూస్తూ.. లక్షల, కోట్ల రూపాయల విలువ చేసే కెమెరాను మెళ్లో వేసుకుని, రెక్కలు కట్టుకుని ఎగిరి, గంతులేసి, చాటుమాటుగా నక్కినక్కి, చెట్లు, పొదలచాటు నుంచి తొంగి చూస్తూ.. ఆకులో ఆకునై.. కొమ్మలో కొమ్మనై.. బురదలో.. బురదనై.. ఇసుకమేటల్లో గుబురుగా పెరిగే గడ్డినై.. అన్నట్టుగా.. రాత్రీపగలూ కఠోర పక్షిలా వాటితో జర్నీ చేస్తేగానీ శ్రీనివాస్‌రెడ్డికి ఈ గుర్తింపు దక్కలేదు. వలస పక్షుల గురించి శ్రీనివాస్‌రెడ్డిని కదిలిస్తే.. వరుస పెట్టి పుస్తకాలు రాసుకోవచ్చు. అంతగా మనదేశానికి వచ్చే వలసపక్షుల గురించి అధ్యయనం చేశారీయన.

**పక్షులకు పుట్టినిల్లు**

నిజానికి భారతదేశం పక్షులకు పుట్టినిల్లంటారు శ్రీనివాస్‌రెడ్డి.

"అంతెందుకు మన రాష్ట్రంలోని కొల్లేరు, ఉప్పలపాడు, నేలపట్టు ప్రాంతాలకే ప్రతీ సంవత్సరం సుమారు 120 జాతులకుపైగా పక్షులు వలసొస్తుంటాయి. అందులో నైజీరియా, సైబీరియా, కెనడా, చైనా, పాకిస్తాన్, శ్రీలంక, ఇండోనేషియా.. ఇలా అనేక దేశాల్ని దాటుకుని ఇక్కడ వాలిపోతుంటాయి" అంటూ అలా వచ్చే పక్షుల్లో ఫ్లెమింగ్ బర్డ్, పెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్స్, వైట్ ఐబీస్ ఇలా పేర్లతో సహా గుర్తుపెట్టుకుని మరీ వాటి లక్షణాలను వివరిస్తుంటారు శ్రీనివాసరెడ్డి.

"అక్టోబర్ మాసంలో పక్షులు వలసరావడం మొదలవుతుంది. ముందుగా కొన్ని పక్షులు మాత్రమే వచ్చి.. పదిరోజులపాటు ఇక్కడ వాతావరణ అనుకూలతల్ని, ఆహార లభ్యతను పరిశీలించి, అన్నీ బాగుంటేనే మిగతా వాటిని తీసుకొస్తాయి. పగటిపూట సూర్యుడ్ని, రాత్రిపూట నక్షత్రాల వెలుగును ఆధారం చేసుకుని.. కొన్నివేల కిలోమీటర్లు ఎక్కడా ఆగకుండా ఒక్కపట్టున ఎగురుకుంటూ ఇక్కడకు వస్తుంటాయి. వలసొచ్చాక గూళ్ళు ఏర్పాటు చేసుకుని, గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లలకు ఎగరడం నేర్పేదాకా.. సుమారు ఆరునెలలపాటు ఇక్కడే ఉంటాయి. ఒకరకంగా బిడ్డను కనడానికి పుట్టింటికొచ్చి, తిరిగి అత్తారింటికెళ్ళే ఆడపడుచులా.. వలసపక్షులు మన దేశాని కొస్తుంటాయి" అంటూ వలసపక్షుల జీవనాన్ని ఎంతో అందంగా పోలుస్తారు టీఎస్సార్.

వలసొచ్చే ఆ పక్షుల్ని పర్యాటకుల సందర్శన కోసం, వాటి సంరక్షణ కోసం మన రాష్ట్రంలో కొన్నేళ్ళుగా అక్టోబర్‌లో 'పక్షుల పండుగ' నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే వలసొచ్చే పక్షుల కోసం వాటి విడిది కోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న కృత్రిమ నివాస స్టాండ్స్ వల్ల, వాటిల్లో అనుకోకుండా ఇరుక్కున్న కొన్ని పక్షులు చనిపోతున్నాయనే విషయాన్ని తన ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి.. వాటికి మార్పులు చేయించేలా చేశారు శ్రీనివాసరెడ్డి. అలా వలసపక్షుల కష్టాల్నీ తన కెమెరాలో బంధించిన దృశ్యాలే 'సలీం అలీ' అవార్డుకి ఎంపిక చేయడం చెప్పుకోదగ్గ విషయం.

**ఓపికుంటేనే**

"పక్షులు చాలా తెలివైనవి. వాటికి నమ్మకం కుదిరేదాకా ఫొటో తీయడానికి వేచి ఉండాలి. అది గంటకావొచ్చు, రోజుకావొచ్చు.. ఏకంగా నెలలు కూడా కావొచ్చు. మంచి క్లిక్ కోసం ఓపిగ్గా ఉండాలి. కెమెరా, గన్ రెండూ నల్లగా ఉంటాయి. పక్షులు పేలే తుపాకీకి ఎంత భయపడతాయో.. కెమెరాను చూసీ అంతే భయపడతాయి. ఆ భయాన్ని పోగొట్టాలంటే.. ఫొటోగ్రాఫర్ సహనంగా ఉండాల్సిందే" అంటూ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ చేయడం కోసం ఫొటోగ్రాఫర్లలో ఉండాల్సిన లక్షణమేంటో చెప్పకనే చెబుతారు శ్రీనివాస్‌రెడ్డి.

**నచ్చితే క్లిక్కే**

సాధారణంగా ఫొటోగ్రాఫర్లంటే ఒక్కొక్కరూ ఒక్కొక్క అంశంలో 'ఫోకస్' పెడుతుంటారు. కానీ శ్రీనివాసరెడ్డి మాత్రం కలర్, బ్లాక్ అండ్ వైట్, నేచర్, వైల్డ్‌లైఫ్, ఫొటో ట్రావెల్, ఫొటో జర్నలిజమ్, వెడ్డింగ్, డాక్యుమెంట్రీ మేకింగ్, పోట్రెయిట్, పోర్టిఫోలియో, అడ్వర్టైజ్‌మెంట్స్ ఇలా అన్ని విభాగాల్లోనూ బ్రహ్మాండంగా 'క్లిక్' అయ్యారు.








> **పక్షులు చాలా తెలివైనవి. వాటికి నమ్మకం కుదిరేదాకా ఫొటో తీయడానికి వేచి ఉండాలి. అది గంటకావొచ్చు, రోజుకావొచ్చు.. ఏకంగా నెలలు కూడా కావొచ్చు.**

ఒరిస్సాలోని మారుమూల అటవీప్రాంతంలో నివసించే బోండా తెగకు చెందిన గిరిజన సౌందర్యాన్ని అనేక వ్యయప్రయాసలకోర్చి శ్రీనివాసరెడ్డి తన కెమెరాలో బంధించిన చిత్రాల్ని చూస్తే.. ఈయన పోర్ట్రెయిట్ చిత్రాల పనితీరు ఏపాటితో అర్థం చేసుకోవచ్చు.

**ఉండవల్లి గుహలు సాక్షిగా..**

"పుట్టి పెరిగింది, విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న గుంటూరు జిల్లా ఉండవల్లి గ్రామంలో. స్కూల్లో ఉన్నప్పుడు ఉండవల్లి గుహల దగ్గరకెళ్ళి చదువుకునేవాళ్ళం. అలా ఒకరోజు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఫొటోజర్నలిస్ట్ శ్రీనివాసన్ వచ్చి గుహల్ని ఫొటోలు తీశారు. తెల్లారి పేపర్లో మావూరి గురించి.. ఆ గుహల గురించి బ్రహ్మాండంగా ఫొటోలు, వార్తలు రావడం నాకెంతో అద్భుతంగా అనిపించింది. ఫోటోలకు ఇంతశక్తి ఉందా?! అనుకుని ఆ క్షణంలోనే ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నా.. తర్వాత కాలంలో ఆయన దగ్గరే రెండేళ్ళపాటు పని నేర్చుకున్నా" అంటూ కెమెరా పట్టుకోడానికి అసలు కారణమేంటో చెప్పుకొచ్చారు శ్రీనివాసరెడ్డి.

"నాలో ఉన్న ఫొటోగ్రఫీ ఆసక్తిని గమనించి చిన్నప్పటి నుంచి బాగా ప్రోత్సహించింది మాత్రం అమ్మ సీతమ్మే. అప్పట్లో కెమెరా కొనుక్కునేంత పరిస్థితులు కుటుంబంలో లేకపోయినా డబ్బులు పోగు చేసి, అమ్మ నాకు కెమెరా కొనిచ్చింది. మొన్నీ మధ్య కూడా అత్యంత ఖరీదైన 'హేజల్ బ్లేడ్' కెమెరా కొంటున్నప్పుడు "డబ్బు అయితే అయ్యిందిలే. అవసరమైతే కొంత పొలం అమ్మేసి, ఆ కెమెరా కొనుక్కో..!" అని నా కల నెరవేర్చుకోడానికి అమ్మ సాయపడిందంటే ఆమె ఆశీస్సులు ఎలాంటివో.. తల్లి 'రుణం' తీర్చలేదని చెప్పకనే చెబుతారు శ్రీనివాసరెడ్డి.

**శ్రీనివాసరెడ్డి.. ఛాయాచిత్రలోకానికి కొత్తవాడేమీకాదు. ఫొటోగ్రాఫర్‌గా అనేక దేశాలు, ప్రాంతాలు చుట్టొచ్చాడు. చూసినవి, నేర్చుకున్నవి పుస్తకాలుగా రాశాడు. ప్రపంచస్థాయి ఫొటోగ్రఫీ సంస్థలు, సంఘాలతో ఆత్మీయమైన అనుబంధాలు, సభ్యత్వాలు, బాధ్యతల్ని నెరవేరుస్తున్నారు. అవార్డులు, రివార్డులు, సత్కారాలకు లెక్కేలేదు. ఫొటోగ్రఫీ అంశంలో అనేక యూనివర్సిటీల్లో పాఠాలు, రేడియోలో శతాధిక ప్రసంగాలు.. వీటికితోడు సాహితీ మిత్రుల సాంగత్యం.. ఇవన్నీ రెడ్డిగారి ఫొటోగ్రఫీలో క్లి(కి)క్ ఇచ్చే అంశాలే. రేపటితరానికి రాశులుగా పోయబోయే అనేక ఆలోచనలు, ప్రయత్నాలు, కృషీ జరుగుతూనే ఉంది. ఆ వైపుగా ఇప్పటికే ఆయన చేతిలోని 'హేజల్ బ్లేడ్' కెమెరా లెన్స్ గురిపెట్టే ఉన్నాయి. క్లిక్.. క్లిక్.. క్లిక్!!**

**- గంగాధర్ వీర్ల**